క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌గా వినోద్‌బాబు బాధ్యతల స్వీకరణ



ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న వినోద్‌బాబు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా వినోద్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేసిన నారాయణరావు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో వినోద్‌బాబును నియమిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ప్రిన్సిపాల్ వినోద్‌బాబు గతంలో విజయనగరం జిల్లా చీపురుపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేసి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతన ప్రిన్సిపాల్‌కు కళాశాల అధ్యాపక బృందం పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

చెక్ పవర్ రద్దు ఉత్తర్వుల నిలిపివేత

పరవాడ: మండలంలో వెన్నలపాలెం సర్పంచ్ చెక్‌పవర్ రద్దు ఉత్తర్వులను నాలుగు వారాల పాటు నిలిపివేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక కల్యాణమండపం నిధులను దుర్వినియోగం పరిచారన్న అభియోగంపై తన చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ ఇటీవల అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి శిరీషరాణి ఉత్తర్వులు జారీ చేశారని సర్పంచ్ అప్పారావు తెలిపారు. ఆ ఉత్తర్వులను రాష్ట్ర హైకోర్టు నాలుగు వారాల పాటు నిలుపుదల చేసిందని ఆయన చెప్పారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

అదీప్ రాజ్ పరామర్శ



అర్జున దంపతులను పరామర్శిస్తున్న అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని ఆరిపాక పంచాయతీ వార్డు సభ్యుడు దార అర్జున్ దంపతులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శుక్రవారం పరామర్శించారు.ఇటీవల సబ్బవరంలో జరిగిన ప్రమాదంలో గాయపడిని వారిని ఆరిపాకలోని వారి నివాసంలో పార్టీ శ్రేణులతో కలిసి పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ అధికార ప్రతినిధి కోటాన రాము, మండల కన్వీనర్ కర్రి బాబు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్,మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాల నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, పార్టీ నేతలు ఎస్.పి. రాజు,దనిమిరెడ్డి శ్రీనివాసరావు,సబ్బవరపు నాగభూషణం,మళ్ల బాలాజీ,బండారు రమణ, రాజు,యడ్ల నాయుడు,పెచ్చేటి రమేష్ నాయుడు తదితరులు ఉన్నారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ



పసువుల దాణా పంపిణీ చేస్తున్న సర్పంచ్ శంకరరావు తదితరులు

సబ్బవరం: మండలంలోని నారపాడులో 50 శాతం రాయితీపై పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల దాణా పంపిణీ శుక్రవారం జరిగింది. గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా పాడి రైతులకు పశువుల దాణా అందజేశారు. సబ్బవరం మండలానికి గాను 209 బ్యాగ్‌లు 50 కిలోల చొప్పున రావడంతో పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వెటర్నరీ డాక్టర్ ఎస్. స్వర్ణలత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు గొర్లి నూకరాజు, గ్రామ పెద్దలు గోవింద్, వెటర్నరీ సిబ్బంది కేవీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కేంద్రంగా బోధన సాగాలి



సమావేశంలో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

మల్కాపురం: ఉపన్యాస పద్ధతిలో కాకుండా విద్యార్థి ఆధారిత బోధనా పద్ధతులపై అధ్యాపకులు దృష్టి పెట్టాలని ప్రముఖ విద్యావేత్త యోగేష్ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శుక్రవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారు. అధ్యాపకులు సమాచారం ఇవ్వడం పై కాకుండా విద్యార్థిని ఉత్తేజ పరిచే విధంగా దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి పోక్స్ చట్టంపై ప్రసంగించారు.

హైలో..హైలెస్సా..

- ముగియనున్న చేపల వేట నిషేధం
- నేటి అర్ధరాత్రి వేటకు వెళ్లనున్న గంగపుత్రులు
- పడవలు, వలలు, ఇంజిన్లు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు



వలలు సిద్ధం చేసుకుంటున్న గంగపుత్రులు



చేపల వేటకు సిద్ధమవుతున్న మత్స్యకారులు

పరవాడ: సముద్రంలో చేపల వేట నిషేధం శనివారం అర్ధరాత్రితో ముగియనుంది. రెండు నెలల పాటు ఖాళీగా ఉన్న మత్స్యకారులు మళ్లీ సముద్రంలో చేపల వేటకు వెళ్లేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. మండలంలో ముత్యాలమ్మపాలెం, దిబ్బపాలెం, తిక్కవానిపాలెం, జాలారిపేట గ్రామాలకు చెందిన మత్స్యకారులు చేపల వేటే ప్రధాన వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది తరచూ ఏర్పడ్డ తుపా నలతో సముద్రం అల్లకల్లోంగా మారింది. సముద్రంలో చేపల వేట సజావుగా సాగక గంగపుత్రులు తీవ్ర నష్టాలు చవిచూశారు. ఈ ఏడాదైనా చేపల వేట సజావుగా సాగి తమ వలలకు చేపలు భారీగా చిక్కాలని గంగమ్మ తల్లికి, ముత్యాలమ్మ తల్లికి, కులదేవతలకు మొక్కులు చెల్లించుకుని వేటకు సిద్ధమవుతున్నారు. ఏటా ఏప్రిల్ 14 నుంచి జూన్ 15 వరకు చేపల పునరోత్పత్తి సీజన్ కావడంతో కేంద్ర ప్రభుత్వం రెండు నెలల పాటు సముద్రంపై చేపల వేట నిషేధం అమలు చేస్తుంది. ఈ సమయం ముగియడంతో రెండు నెలలు ఖాళీగా ఉన్న గంగపుత్రులు శనివారం అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత సముద్రంపై చేపల వేటకు పడవలు, వలలు, ఇంజిన్లు సిద్ధం చేసుకుంటున్నారు. చేపల వేట నిషేధ సమయం కావడంతో మత్స్యకారులు 61 రోజులు సముద్రంపై చేపల వేటను మానుకోవడంతో ఆ వ్యవధిలో సముద్రంలో మత్స్య సంపద పుష్కలంగా పెరుగుతుంది. దీంతో తమ వలలకు ఇబ్బడి ముబ్బడిగా చేపలు చిక్కుతాయన్న ఆశతో మత్స్యకారులు వేటకు బయలుదేరుతున్నారు. ఏటా సముద్రంలో ఏర్పడుతున్న తుపాను విపత్తులతో గంగపుత్రులు సావాసం చేయక తప్పడం లేదు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విపత్తులు వెంటాడుతుంటాయి. సముద్రంపై వేటకు వెళ్లిన సమయంలో తుపాన్లు సంభవించి చేపల వేట మానుకుని తిరుగుముఖం పట్టాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఎలాంటి తుపాను విపత్తులు తమకు ఎదురు కాకుండా ఆదుకోవాలని మత్స్యకారులు దేవతలను వేడుకుంటున్నారు..

అంతా గంగమ్మతల్లి దయ..



ఈ ఏడాదైనా ఎలాంటి ఆటుపోట్లు లేకుండా చేపల వేట సజావుగా సాగి వలలకు పుష్కలంగా చేపలు చిక్కాలని గంగమ్మ తల్లి, గ్రామ దేవతలను వేడుకుంటూ వేటకు సిద్ధమవుతున్నాం. గ్రామ దేవతల చల్లని చూపు మాపై ఉంటుందని ఆశిస్తున్నాం. గత ఏడాది చేపల వేటలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఆర్థికంగా నష్టపోయాం. ఈ ఏడాది గంగమ్మ తల్లిపై నమ్మకం ఉంచి వేటకు బయలుదేరుతున్నాం. – అరిజిల్లి మసేను

విపత్తులతో చేపల వేటకు విఘాతం..



తుపాన్ల ప్రభావంతో గత ఏడాది చేపల వేట సజావుగా సాగక తీవ్రంగా నష్టపోయాం. ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాల పోషణ కష్టంగా మారింది. అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొచ్చాం. ఈ ఏడాదైనా గంగమ్మతల్లి కరుణించి అనుకూల పరిస్థితులు కల్పిస్తే చేపల వేట సజావుగా సాగుతుందని ఆశిస్తున్నాం. తద్వారా ఆర్థిక ఇబ్బందుల నుండి గట్టెక్కుతామని అనుకుంటున్నాం. – చింతకాయల అప్పన్న

వ్యర్థ రసాయనాలతో చేపలు చనిపోతున్నాయి..



ఫార్మాసిటీ పరిశ్రమల వ్యర్థ రసాయనాలు విచ్చలవిడిగా సముద్రంలో విడుదల చేయడం వల్ల మత్స్య సంపద నశించిపోతుంది. సముద్రంలో రోజంతా వేట సాగించినా వలలకు చేపలు చిక్కడం లేదు. చిన్నా చితకా చేపలు చిక్కినా వాటిని అమ్మగా వచ్చిన సొమ్ము డీజిల్ ఖర్చులకు కూడా సరిపోవడం లేదు. శుద్ధి చేసిన వ్యర్థ రసాయనాలను మాత్రమే సముద్ర జలాల్లో విడుదల చేయాలి. – కొవిరి ఎర్రయ్య

అప్పన్నను దర్శించుకున్న పాండిచ్చేరి హోంమంత్రి



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న నమశ్శివాయ

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని పాండిచ్చేరి హోం మంత్రి ఎ.నమశ్శివాయ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేష వస్త్రం అధికారులు అందజేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

పెందుర్తి: జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అయిత సింహాచలం ఆధ్వర్యంలో స్థానిక లయోలా వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న దాదాపు 140 మంది వృద్ధులకు మధ్యాహ్న భోజనం పెట్టారు. ఈ సందర్భంగా సింహాచలం మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆశ్రమానికి తగిన సహకారం అందిస్తామని మాటిచ్చారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు జన్మదినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం నేడు

ఉక్కునగరం: స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సెక్టార్–5 అంబేడ్కర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్న శిబిరాన్ని కేజీహెచ్ జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ డి. రాధాకృష్ణన్ ప్రారంభిస్తారని యూనియన్ ప్రధానకార్యదర్శి యు. రామస్వామి తెలిపారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో స్వామికి యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న దాతలు

పెందుర్తి: ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక అమృత ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు 60 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ ఎ.మురళీధర్ మాట్లాడుతూ ఒకరు రక్తదానం చేస్తే కనీసం ముగ్గురికి ప్రాణదానం చేసినట్టేనని చెప్పారు. రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో పెందుర్తి ఏఎస్ఐ బాబూరావు, ఉదయ్ దొర సెయింట్ జోసెఫ్ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ డాక్టర్ సునీత, సాయిహెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు దాడి శ్రీనివాస్, సిరిమల్ల గణేష్, అమృత విద్యా సంస్థల డైరెక్టర్ వి.వి రమణ ప్రసాద్, కార్యదర్శి ఎన్.లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం



యువశక్తి శిక్షణ శిబిరంలో పాల్గొన్న సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు



ముగింపు కార్యక్రమంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సబ్బవరం: స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 13వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహిస్తున్న ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం–6 శుక్రవారంతో ముగిసింది.వర్సిటీలో నిర్వహించిన న్యాయవాదుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను అభినందించారు.భవిష్యత్తులో క్రమశిక్షణతో దేశానికి సేవలందించాలని ఆయన ఆకాంక్షించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.శిక్షణ కార్యక్రమం పూర్తిచేసుకున్న క్యాడెట్స్‌ను వర్సిటీ వీసీ ఆచార్య డాక్టర్ డి. సూర్యప్రకాశరావు అభినందించారు.ఈ కార్యక్రమంలో క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్ణిమ్ ప్రభాత్, సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు,ఎన్‌సీసీ అధికారులు జగదీష్,మూర్తి,లెఫ్టినెంట్ విద్యాసాగర్, డాక్టర్ హరికిరణ్‌తో పాటు 468 ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



అధ్వానంగా మారిన రావాడ–నునపర్తి రహదారి

పరవాడ: మండలంలో రావాడ–నునపర్తి రోడ్డు అధ్వానంగా మారడంతో గ్రామీణ ప్రజలు నరకయాతన పడుతున్నారు. బొట్టవానిపాలెం నుంచి రేకవానిపాలెం వరకు అడుగుకో గుంత ఏర్పడడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రహదారిలో రావాడ, గొల్లగుంట, రేకవానిపాలెం, నునపర్తి గ్రామాల ప్రజలతో పాటు శివారు గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తారు. పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు ప్రతి రోజు రాకపోకలు సాగిస్తున్నారు. గొల్లగరువు వద్ద రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువును తలపిస్తుంది. గోతులుగా మారిన రహదారిలో రాత్రి వేళ ప్రయాణం ప్రమాదాలతో కూడుకుందని ప్రయాణికులు వాపోతున్నారు. కాగా ఏళ్ల తరబడి రహదారి మరమ్మతులతో మూల్గుతుండడంతో ప్రజలు ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే రహదారులను అభివృద్ధి చేస్తామని హామీలు గుప్పించిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రోడ్ల సంగతి మరచిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలను గుర్తించి రావాడ–నునపర్తి రోడ్డు అభివృద్ధికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో బహుళ ప్రయోజనాలు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, నాయకులు

గాజువాక: గృహ విద్యుత్ వినియోగదారులు సోలార్ రూఫ్‌టాప్‌ను నిర్మించుకోవడం ద్వారా పలు ప్రయోజనాలను పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏడీఈ పార్థసారథి అన్నారు. స్థానిక చైతన్యనగర్‌లో శుక్రవారం నిర్వహించిన సోలార్ రూఫ్‌టాప్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోదలచిన వినియోగదారులకు ప్రభుత్వం నేరుగా రూ.78 వేలు సబ్సిడీ అందిస్తోందన్నారు. సోలార్ పవర్‌ను ఏర్పాటు చేసుకోవడం వల్ల వినియోగదారుల విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదని, మిగులు విద్యుత్ ఉంటే ప్రభుత్వమే తీసుకొని నగదు చెల్లిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకుంటే విద్యుత్ బిల్లు పూర్తిగా ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా సోలార్‌పవర్ బ్రోచర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో 72వ వార్డు కార్పొరేటర్ ఎ.జె.స్టాలిన్, చినగంట్యాడ సబ్ స్టేషన్ ఏఈ రామకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అలివేలు మంగమ్మకు ప్రత్యేక పూజలు



పూజలందుకున్న అలివేలు మంగమ్మ



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: చినముషిడివాడ సమీపంలోని సప్తగిరి నగర్‌లో కొలువుదీరిన అలివేలు మంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు మణిబాబు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.

గ్యాస్ లీకేజీ ఘటనపై విచారణ జరపాలి



ఫార్మాసిటీలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ఎస్ఎస్ ఫార్మా పరిశ్రమలో గురువారం జరిగిన గ్యాస్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీలో సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఫార్మాసిటీ పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సాల్వెంట్ వద్ద ఇండికేటర్‌ను కూడా ఏర్పాటు చేయలేదన్నారు. పరిశ్రమల్లో హెల్త్‌కేర్ సెంటర్‌లో ఆక్సిజన్ అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, పరిశ్రమల్లో భద్రత ఆడిట్‌ను నిర్వహించాలని, ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన ర్యాలీలో సీఐటీయూ నాయకులు గుమ్మాల సింహాచలం, ప్రసాద్, లోవరాజ, శ్రీను, రమణ పాల్గొన్నారు.

చెరువు కాదు రోడ్డే..



జీవీఎంసీ 97వ వార్డు సప్తగిరినగర్ ప్రధాన రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. బీఆర్‌టీఎస్ రహదారి నుంచి కాలనీకి వెళ్లే మార్గం చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షానికే రోడ్డు మీద ఏర్పడిన గుంతలు నిండిపోయి ప్రజలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు. –పెందుర్తి

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ కేసుల్లో ముగ్గురి అరెస్టు

- 190 కిలోల కాపర్ వైర్ స్వాధీనం
- డీఎస్పీ విష్ణు స్వరూప్



నిందితులతో డీఎస్పీ విష్ణుస్వరూప్, సీఐ రామచంద్రరావు తదితరులు

సబ్బవరం: ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు మండలాల్లో గత రెండేళ్లుగా ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన 42 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేసిన కేసుల్లో ముగ్గురు నిందితులను స్థానిక పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్ వివరాలు వెల్లడించారు. విశాఖపట్నంలోని మర్రిపాలెంకు చెందిన గరికిపాటి సాయికిరణ్,పట్నాల రాజేశ్వరరావు,మహారాణిపేటకు చెందిన నెల్ల సాయిప్రసాద్ అనే ముగ్గురు యువకులతో పాటు మరో ఇద్దరు కలిసి 2023 నవంబర్ నుంచి 2025 జూన్ వరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని సబ్బవరం, ఆనందపురం, పెందుర్తి, అచ్యుతాపురం, చోడవరం, కె.కోటపాడు, యలమంచిలి, భీమిలి మండలాల్లోని ఏపీఈపీడీసీఎల్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు. ఎనిమిది మండలాల్లో 42 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ చేయగా, అత్యధికంగా సబ్బవరం మండలంలో 15 ట్రాన్స్‌ఫార్మర్లు అపహరించినట్టు డీఎస్పీ తెలిపారు. చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైర్‌ను తొలగించి, అమ్మేశారని తెలిపారు.ఈ విధంగా వారు విక్రయించిన 190 కిలోల కాపర్ వైర్‌ను రికవరీ చేసినట్టు చెప్పారు. చోరీ చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల విలువ రూ.54 లక్షల వరకూ ఉంటుందన్నారు.ఈ కేసుల్లో మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని డీఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ జి.రామచంద్రరావు,ఎస్ఐలు సింహాచలం, దివ్యలతో పాటు మిగిలిన సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

విశ్వబ్రాహ్మణులపై పాలకుల చిన్నచూపు



విశ్వబ్రాహ్మణ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

కూర్మన్నపాలెం: విశ్వబ్రాహ్మణులను ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ఆంధ్ర రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.హనుమంతరావు ఆరోపించారు. ఆ సంఘ కార్యవర్గ సమావేశం శుక్రవారం కూర్మన్నపాలెంలో నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా తమ సామాజిక వర్గాన్ని పట్టించుకోవడం లేదని సభ్యులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులు ఎంతమంది ఉన్నారన్న విషయం ప్రభుత్వాలకు తెలియాలంటే కులగణన చేయాలని తీర్మానం చేశారు. అలాగే సెప్టెంబర్ 17న అమరావతిలో యజ్ఞం నిర్వహించాలని నిర్ణయించారు. విశ్వబ్రాహ్మణులకు ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం నాయకులు పాపయ్య, నరసింహాచారి, శ్రీనివాసరావు, కాకుమూరు వెంకటవేణు పాల్గొన్నారు.